# ఏకాకి

రచన :
శ్రీమతి పరానేని శ్రీశైలభ్రమరాంబ

రుద్రాక్షయ్య ఆ ఊరు పదహారేళ్ల వయస్సులో ఏకాకిగా వచ్చాడు. ఓ ముతక పంచకట్టుకు మూడుమూళ్ల ఉత్తరీయం భుజాన్ని వేసుకొని— అక్కడా అక్కడా వారాలు చేసుకుతింటూ, సత్రం అరుగుమీద పడకవేస్తూ, ఊళ్లో అందరికీ నీళ్లకావిళ్లు మోస్తూండేవాడు. క్రమంగా నెలరోజులయ్యేసరికి వంటవాళ్లతో పరిచయం సంపాదించి, వారితో సహాయంగా వెళ్లి నేర్చుకొంటోనప్పుడే వారితో సమానమైన డబ్బుల్ని కిట్టించుకొనేవాడు - మాఖాదిపంచకాల్లో పెళ్లిళ్లల్లో సంభావనలు పుచ్చుకొనేవాడు. వేదం, చివరకు ఆశీర్వచన పన్నాయైనా, రాకపోయినా స్వతహాగా తెలివైనఘటం కాబట్టి పండితుల వెనక కూర్చుని తద్దినం పెట్టేవాని తమ్మునిలా చెలామణీ అయ్యేవాడు రుద్రాక్షయ్య.

గిర్రున నాలుగేళ్లు తిరిగేసరికి రుద్రాక్షయ్య కొంత సొమ్ము నిలవచేసుకొన్నాడు. ఏకాకి కాబట్టి ఎక్కడో ఓ చోట తనకి తిండి గడిచిపోయేది. వచ్చినడబ్బంతా మిగుల్చుకోకపోతే కష్టార్జితాన్ని ఖర్చుచేస్తాడామరి? రుద్రాక్షయ్యకి కాఫీలు, టీలు, కిళ్లీ, సిగరెట్లు, బీడీలు, అల్లాంటి దురలవాట్లేమీలేవు. పాలు అసలే త్రాగడు. ఎంత దూరం వెళ్లినా కాలినడకనేగాని బళ్లకి, బస్సులకి ఖర్చు చెయ్యడం ఆతనికి కిట్టదు. తనకి ఇల్లువాకిలి లేకపోవడం చేత ఈ డబ్బు తనదగ్గరే వుంటే దొంగల భయమని వడ్డీకి అప్పులు ఇచ్చేవాడు రుద్రాక్షయ్య. అప్పు తీసుకొన్నవారు వడ్డీ పెరిగిపోతోందని తొందరగా తీసుకోమని ఎంత బలవంతంచేసినా, తనకి దాచుకొనే స్థలంలేక రేపు మాపు అంటూ కాలయాపన చేసేవాడు రుద్రాక్షయ్య.

ఓ రోజున అప్పుతీర్చడానికి వచ్చినవాళ్లూ రుద్రాక్షయ్య పుర్ష అవడుతోంటే శరభయ్య అనేఆయన చూచి విషయమంతా అడిగి తెల్సుకొని "రుద్రాక్షయ్యా! బాకీ వసూలు ఇచ్చినప్పుడు తీసుకోకపోవడం నీదేతప్పు. కాదంటావా? ఈ రోజునుంచీ ఇంకనువ్వు వడ్డీపుచ్చుకోని పద్ధతినైతే ఎంతకాలమైనా ఇబ్బందిలేదు." అంటూ తీర్పు చెప్పేసరికి మాటఘరానా మనిషి, గ్రామపెద్ద అయిన శరభయ్య మాటకి ఎదురుచెప్పలేక రపీమని పుచ్చుకొన్నాడు రుద్రాక్షయ్య.

కొద్దిరోజులకే శరభయ్యకి కూడా డబ్బు అవసరమై రుద్రాక్షయ్య దగ్గరికి వచ్చాడు. ఇదే తరుణానికై ఎదురు చూస్తూన్న రుద్రాక్షయ్య శరభయ్యచేత ప్రామిశరీనోటు వ్రాయించుకు పంద రూపాయలు ఇచ్చాడు.

కాస్త సంపాదనలో వున్నవాడు, ఇరవైయేళ్లవాడు అయిన రుద్రాక్షయ్యకి పిల్లనికూడా ఇవ్వడానికి వచ్చారు. రుద్రాక్షయ్యకి ఒక్కటే భయం. తను ఎంతోకష్టపడి సంపాదించిన ధనమంతా ఓ అయ్యకన్న కూతురికోసం వృధాగా ఖర్చుచెయ్యాలేమో! ఇదే రుద్రాక్షయ్యకి బెంగ- చివరికి ఎల్లాగో బ్రహ్మాండంమీద ఒప్పించి మల్లమ్మ అనే పిల్లనిచ్చి వివాహంచేసారు. పెళ్లయిన మర్నాడే తల్లితండ్రులు లేని మల్లమ్మ కాపురానికొచ్చింది.

గ్రామంలో పలుకుబడి గలవాడు, పిల్లలుగలవాడు, మంచివాడు అయిన శరభయ్య తన ఇంట్లోనే ఓ ప్రక్కవాటాలో అద్దెలేకుండా భార్యతో కాపురం వుండమన్నాడు రుద్రాక్షయ్యని. మల్లమ్మ చాలా అమాయకురాలు. భయభక్తులుగల ఇల్లాలు. భర్తమాటకి అడుగుదాటని మహాసాధ్వి. అందుకు తగ్గట్టుగానే రుద్రాక్షయ్యకూడా ఆమెకి స్వతంత్రం ఇవ్వకుండా తన అడుగుజాడల్లో నడిచే యంత్రంలా జాగ్రత్తగా చూచుకొంటూండేవాడు.

శరభయ్య ఇంట్లోకివచ్చాక రుద్రాక్షయ్యకి కొంచెం లౌకిక వ్యవహారాల్లోకూడా పరిచయమైంది. శరభయ్య వెనక్కాలే వెళ్లి కొన్నాళ్లు బాగా తర్ఫీదుపొంది ఒక ఏడాదిలోనే తనకి తానుగా వ్యవహారాలు పరిష్కారం చెయ్యడం నేర్చుకొన్నాడు రుద్రాక్షయ్య. ఎవరైనా భూమి కొనుక్కొంటామని చెప్పడమే తదువుగా ఆ భూమి గల వారి దగ్గరికి వెళ్లి క్రియంమాట్లాడి కొనేవారికి అమ్మే వారికి మధ్యవర్తిగా వుండి ఎంతటి పేచీ వ్యవహారమైనా తన వాక్చాతుర్యంతో ఇట్టే పరిష్కారంచేసి క్రియదస్తావేజులు వ్రాయించి, తను బ్రోకరుగా వున్నందుకు ఇరు

పక్షాల వారిదగ్గరా కూడా సొమ్ము గుంజుకొనేవాడు. కాని రుద్రాక్షయ్యలో వున్న చాకచక్యం ఏమంటే; ఎవరిదగ్గరా డబ్బు తీసుకు పరిష్కారం చేస్తూనట్లు అనిపించకుండా పుచ్చుకోవల్సిన దానికంటే రెండురేట్లు పిండుకు వసూలు చేసుకొనేవాడు. ఇంకోసంవత్సరం గడిచేసరికి రుద్రాక్షయ్య నిలవసొమ్ము వందలుదాటి వేలసంఖ్యలోకి చేరింది. ఇప్పుడైతే పెట్టె బేదావున్న సంసారి కాబట్టి ఇంట్లోనే భద్రంగా దాచుకొనేవాడు రుద్రాక్షయ్య.

పాపం! శరభయ్య పెద్ద కుటుంబీకుడు కావడంచేత ఎప్పుడూ డబ్బుఅవసరం వస్తూనేవుండేది. పది, పరకా, పాతిక, కావాలన్నప్పుడు (డబ్బు విషయంలో మొహమాటం లేదు కాబట్టి) గిన్నెలు, బిందెలు, గుండిగలు తాకట్టు పెట్టించుకు వడ్డీకి ఇస్తూండేవాడు రుద్రాక్షయ్య. ఏ క్షణాన్న డబ్బు కావాలన్నా బయటికివెళ్లి తెచ్చుకోనవసరంలేకుండా ఎప్పటికప్పుడే సర్దుబాటు చేస్తూండడం చేత చల్లని సంసారంలో ఈ చిల్లరివెచ్చం వారి కుటుంబాన్ని నిలువుదోపిడీ చేసింది. ఏడాది తిరక్కుండానే శరభయ్య ఇల్లు రుద్రాక్షయ్యకి తనఖాపెట్టాడు.

రుద్రాక్షయ్య ఎవరికి అప్పులిచ్చినా కాని శకునిహస్తం లాంటిది. ఆతనికి ఎవరైనా ప్రాంశరీనోటు వ్రాసిఇస్తే చాలు; వారి యావదాస్థి క్రియం వ్రాయించుకొనేవరకూ అడిగినప్పుడల్లా బదులు ఇచ్చి ముంచేసి; చిట్టచివరకు సర్వం క్రియం వ్రాయించుకుని వదలిపెట్టేవాడు- రుద్రాక్షయ్యది భస్మాసురహస్తం, అని పరోక్షంలో అనుకొంటోన్నా కాని, అవసరానికి ఆతని దగ్గరికి రాక తప్పేది కాదు తలమాసిన అభాగ్యులకి.

రుద్రాక్షయ్య భార్య కాపురానికి వచ్చిన నాలుగేళ్లల్లో ఇద్దరు బిడ్డల తల్లిఅయింది. అప్పటినుంచీ ఆతనిలో పిసినారితనం మరీ హెచ్చిపోయింది. నాలుగేళ్లకే తనకి ఓ కూతురు కొడుకు పుట్టారు; ఇంకా ఎందరు పుట్టబోతారో? వీళ్ళకోసం తన సొమ్మంతా ఎంత ఖర్చైపోతుందో! అని బాగా ఆలోచించిన రుద్రాక్షయ్య మూడోసారి భార్య గర్భిణీ అని తెల్సుకోగానే లేడీడాక్టరు యొక్క సహాయం వేడుకొన్నాడు- కాన్పు అయి, మళ్ళీ ఇంక సంతతి కల్గకుండా ఆపరేషన్ చెయ్యాలంటే ఎందవరకూ ఖర్చు పెట్టాల్సి వుంటుందని డాక్టరు సలహాఇచ్చింది. ఒకే సారిగా వంద చెల్లిపోయినా రెండేళ్ళకోసారి క్రొత్తగా అయ్యేఖర్చు తప్పుతుందని రుద్రాక్షయ్య; ముచ్చటగా ముగ్గురుపిల్లలతో సరిపోతే ఆరోగ్యం, పిల్లల భవిష్యత్ బావుంటుందని డాక్టరు; ఏకీభావంతో మల్లమ్మని పురిటికోసం హాస్పత్రిలో చేర్పించారు.

జీవితంలో అన్నిరంగాల్లోనూ జయంపొందిన రుద్రాక్షయ్యకి భార్య విషయంలోమాత్రం అపజయమే పొందాడనవచ్చు. ఎంతో ఆశగా లేడీడాక్టరుని అడగ్గా "ఈమెకి ప్రస్తుతంలో ఏంచెయ్యడానికి వీల్లేదు. ఇంకా ఒకరు ఇద్దరు పుట్టినాకాని భారం వహించాల్సిందే. మీరు చెప్పినట్లు చెయ్యాలంటే మనిషికే ప్రమాదం వచ్చేలావుంది." అంటూభార్యని పుట్టినపిల్లవాణ్ణి చూపించింది రుద్రాక్షయ్యకి.

ముగ్గురు పిల్లల్ని చూసుకు మల్లమ్మ మహదానందం పొందేది. కాని రుద్రాక్షయ్యమాత్రం నిరంతరం దుఃఖంతో కుమిలిపోయేవాడు. బోలెడంత ఆస్థి, ధనం వున్నా భార్యకి నాల్గుచీరలుగాని, పిల్లలకి సరిపోయేవన్ని బట్టలుగాని కొనేవాడు కాదు. అతడుకూడా ఎన్నడూ ఒంటికి ఒక చొక్కాకూడా తొడుక్కుని ఎరుగడు. ఎప్పుడూ ఇరవైనంబరు ముతకపంచ, భుజంమీద అంగాప్రం తప్పించి మరోరకం బట్టలుమాత్రం కట్టుకోడు.

భార్యకి పిల్లలకి కడుపారా తిండికి ఇవ్వడానికే ఎన్నో కుళ్లమాటలు అంటూ తిట్టితిట్టి భత్యాలు ఇస్తూండేవాడు. శరభయ్య ఇల్లు తనపేర క్రియం వ్రాయించుకు వారిని బయటికి సాగనంపేడు. అప్పటినుంచీ ఇంక రుద్రాక్షయ్య నోటికీ చేతికీకూడా హద్దు ఆపూ అనేది లేకుండా తనిష్టమొచ్చినంత క్రూరంగా ప్రవర్తించేవాడు. మూతికి నెయ్యి రాసుకుంటే మూడుసోలల బియ్యపుఅన్నం తినొచ్చు. నెలకి సోలడు నెయ్యేందుకు ఖర్చు.... అన్నంలోకి ఆవకాయ వుంటే చాలదూ? పప్పులు కూరలు లేకపోతేనే బియ్యంఖర్చు ఇంత అవుతోంది. ఇంకావుంటే కొంప గుండం అయిపోయేదేమో!.... ఇల్లాగే సాధించి వేధించేవాడు. ఇద్దరు కొడుకులూ కూతురు తర్వాత మళ్ళీ

ఓ కూతురు పుట్టింది— ఆ తర్వాత ఇంక రుద్రాక్షయ్య బ్రహ్మచర్య వ్రతం పట్టాడు.

నల్గురు పిల్లలతో, పిసినిగొట్టు భర్తతో, అష్టకష్టాలతో పదహారేళ్ళ గడిపింది మల్లమ్మ— కడుపునిండా తిండి తినక, కంటినిండా నిద్రపోక రుద్రాక్షయ్య అనేక వ్యాపారాలు, వ్యవహారాలుచేసి లక్షలకి లక్షలు సంపాదించాడు. ప్రతిరోజూ రాత్రి పన్నెండుమొదలు మూడువరకూ తన డబ్బు, ఆ తాలూకుపద్దులు చూచుకోవడం ఇదే వ్యాపృత్తి రుద్రాక్షయ్యకి.

కట్నం లేకుండా చేసుకొంటామని వచ్చిన సంబంధాలు రెండూ కుదుర్చుకొని కూతుళ్లిద్దరికీ తన చేతిసొమ్ము ఖర్చుకాకుండా గుళ్లో పెళ్లిళ్లుచేసి, చల్లగా అత్తవారిళ్లకి సాగనంపి బాధ్యత వదిలించుకొన్నాడు. కాని కొడుకుల పెళ్లి కొన్నివేలు కట్నంగా తీసుకోవాలని ఆశించాడు రుద్రాక్షయ్య.

హైస్కూలు చదువు పూర్తిచేసిన పెద్దకొడుకు కాలేజీలో చదువుతానని తండ్రిని అర్థించాడు. అప్పటికే చాలా డబ్బు ఖర్చుఅయిందని అలమటించిపోయే రుద్రాక్షయ్య కొడుకు కోరిక నిరాకరించాడు. చదువుయందుగల అభిలాషను చంపుకోలేని ఆతడు ఓ ప్లీడరుగారి అమ్మాయిని పెళ్లిచేసుకు అత్తారింటికి ఇల్లరికం వెళ్లిపోయాడు. తనకి కట్నంతో సంబంధంలేదని "లా" ప్యాసు అయ్యేవరకూ మామగారు చదివిస్తానన్నారనీ చెప్పిన పెద్దకొడుకుపై మండిపడి తను బ్రతికివుండగా తన గుమ్మంలో కాలు పెట్టవద్దని ఖండితంగా చెప్పేశాడు రుద్రాక్షయ్య. పెద్ద కొడుకు తనవాడు కాదని పూర్తిగా నిరాశచేసుకొని, చిన్న కొడుకునైనా తనవలె తర్ఫీదు చేద్దామని ఆశించాడు, కాని అన్నకంటే ఏడాకు లెక్కువచదివిన తండ్రితో కలహించి "ముష్టెత్తుకునైనా చదువుకుని ఒక హోదాతో బ్రతుకుతానుకాని, నీవలె దరిద్రుడుగామాత్రం ఈ కొంపలో నేనింక క్షణమైనా వుండవల్చుకోలేను" అంటూ వెళ్ళిపోయాడు రుద్రాక్షయ్య చిన్నకొడుకు.

నల్గురు పిల్లలూ ఎవరిదోవన వాళ్లు వెళ్ళిపోగానే మల్లమ్మకి మనోవ్యాధి ఎక్కువైంది. పిల్లలు తనని వదలి వెళ్ళిపోయినా ఖర్చు తగ్గిందని సంతోషించాడే కాని రుద్రాక్షయ్య మనస్సులో ఏనాడూ తన భవిష్యత్తును గురించి ఊహించలేదు.

మల్లమ్మకి మానసిక వ్యాధికితోడు ఇంట్లో సరియైన తిండికూడా లేకపోవడంతో క్రమంగా నానాటికీ క్షీణించుకొచ్చేది. రుద్రాక్షయ్యకి ధనసంపాదన, వ్యవహారాలు చూసుకోవడం తప్పించి భార్య పరిస్థితిని గమనించే స్థితిలో లేడు. ఆమె చెప్పినా వినడు. ఇతరు లెవ్వరైనా చెప్పినా అవి ఆతని తలకెక్కవు.

చిట్టచివరి స్థితిలోకూడా భార్యకు చాలా ప్రమాదకరంగా వుండగా, ఎవరిదో వ్యవహారం పరిష్కరించాలని వెళ్ళిపోయాడు రుద్రాక్షయ్య. ఆతడు వెళ్ళిన కొన్ని గంటలకే మల్లమ్మ చనిపోయిందన్న వార్త చెప్పాక కూడా, అక్కడ పని పూర్తిచేసుకు ఇంటికివచ్చి భార్యకి అంత్యక్రియలు నెరవేర్చాడు రుద్రాక్షయ్య.

(తరువాయి 19వ పేజీలో)



(10వ పేజీ తరువాయి)


ప్రొద్దున్నే ఝాము ప్రొద్దెక్కేసరికి భోజనంచేసి చిల్లర తగవుల్ని రాజీచేసి ఇరుపక్షాల వారివల్ల కొద్దో గొప్పో రాబట్టుకొని, సబ్‌రిజిష్టారు ఆఫీసు దగ్గరికి పది అయ్యేసరికి పోయేవాడు. దస్తావేజులు వ్రాయించుకొనే పార్టీలు వస్తే వారికి మధ్యవర్తిగా వుండేవాడు. చీకటి పడేసరికి ఇల్లు చేరుకొని ప్రొద్దున్నే వండుకొన్న అన్నం మళ్ళీ పెట్టుకు తినేవాడు. లోకాన్ని తల్లక్రిందులుచేసే పెనుగాలి వీచినా, కుంభవృష్టిగా వర్షాలుకురిసినా, నిప్పులు కురిసే ఎండల్లోనైనా టైమ్ తప్పకుండా వెళ్ళడం, రావడం, సంపాదించడమే రుద్రాక్షయ్య దిన చర్య.

అరునెలల నుంచి రుద్రాక్షయ్య చాలా అనారోగ్య స్థితిలో వుంటున్నాడు. అప్పుడుమాత్రం తను ఏకాకినని మనస్సులో కుమిలిపోతున్నాడు రుద్రాక్షయ్య. కాని ఏం ప్రయోజనం? తనకి షష్ఠి పూర్తిఅవుతోన్నా ఏనాడూ తన కూతుళ్ళని, అల్లుళ్ళని ఒక్క పండుగకైనా ఇంటికి తీసుకువచ్చిన పాపాన్నపోలేదు. మల్లమ్మ చనిపోయినప్పుడు కూడా ఆడపిల్లలికి తెలియనివ్వలేదు. వస్తే వాళ్లవల్ల తనకి ఖర్చు.... తన పెద్దకొడుకు ప్లీడరు. రెండోకొడుకు డాక్టరు. తన కూతుళ్లు, కొడుకులు అందరూ తమలోతాము బాంధవ్యం, అభిమానం, ప్రేమ, చూపించుకు వారిలో వారు చూసుకొంటూనే వున్నారు. కాని ఈ తండ్రి రుద్రాక్షయ్య మీద పూర్తిగా మనసు విరిగిపోయి, వున్నాడో; లేడో; కూడా ఎవరూ పట్టించుకోలేదు.

చివరి రోజుల్లో రుద్రాక్షయ్య నెలరోజులు మంచం మీద వుండి ఎంతో మరణవేదన పడేవాడు, లేవలేడు; లేస్తే కూర్చోలేడు; చావు బ్రతుకుల్లోనే తను ఏకాకిననీ, చేతులారా తనపీకకి తనే ఉరిపోసుకున్నాననీ భోరున ఏడ్చేవాడు. ఆ స్థితిలోవున్న రుద్రాక్షయ్యని ఊళ్లోవారే, పట్నంలో ఓ గవర్నమెంటు హాస్పత్రికి తీసుకెళ్ళి ఒప్పజెప్పారు.

డాక్టర్ రుద్రాక్షయ్యని చూచాడు. పోషణ, సంరక్షణ లేక ఆతనిస్థితి ఎంత హైన్యంగా వుండాలో అంత హీనంగావుంది రోగి కళేబరం. అయినా ఆ రోగిని చూచేసరికి డాక్టరు నిలువునా నీరైపోయాడు. అల్లాగే రోగిముఖం చూస్తూ కళ్ళంట అశ్రువులు కారుస్తున్నాడు. లాభంలేదని అక్కడివాళ్లు చెబుతూన్నా సిరంజీకి మందు ఎక్కించి ఇంజెక్షన్ ఇవ్వబోయాడు.

తన చేతిమీదుగా ఎన్నో విషాదజీవితాలకు నిశ్చలంగా అంతిమాశ్వాసాలు కల్పించిన ఆ డాక్టర్ రుద్రాక్షయ్య గుండెలు పరీక్షించి, ఆ ముఖాన్ని చూశ్శాక "నాన్నా! దిగ్గజాలవంటి ఇద్దరు కొడుకులం వుండగా ఏకాకివై పోయావా?" అని తండ్రి గుండెలపై తలపెట్టి భోరున ఏడ్చాడు డాక్టరు.



సరళ చిత్రావారి

"మగవారి మాయలు"లో

రాజారెడ్డి, కృష్ణకుమారి